# 29. అపరాధిని

"మీ చెల్లెలి విషయం మీరేమీ పట్టించుకోదలచలేదా?" అంది సావిత్రి విసురుగా, కోపంతో.

"ఏమిటి విశేషం?" అన్నాడు సాంబమూర్తి.

"మామూలు విశేషమే! మీకు లక్షసార్లు చెప్పాను. రోజూ అదే పాటగా చెప్తూండటం వల్ల ఉన్న దాని విలువ కూడా తగ్గిపోతోందనుకుంటాను."

సాంబమూర్తి ఏమీ మాట్లాడలేదు.

"మీరు కల్పించుకొని ఏదో వొకటి చెయ్యకపోతే వంశ గౌరవం ఏమన్నా వుంటుందా? ఇప్పటికే ఊరు ఊరంతా మోగిపోతోంది."

"రెండు మూడుసార్లు చెప్పి చూశాను కాని, అదేమీ మాట్లాడదు–"

"ఏం మాట్లాడుతుందీ? అపరాధిని కనుక మీ రన్న మాటలన్నీ భరించి ఊరుకుంది."

"ఏదైనా – ఇప్పుడు సరిగ్గానే ఉంటోంది అని నా నమ్మకం!"

"మీకు నమ్మకం వుంది కదా! ఎట్లాగైనా చెల్లెలాయె.... ఐనా పగలల్లా ఉద్యోగంతో కొట్టుకునే మీకు ఇంట్లో ఏం జరుగుతోందో ఎలా తెలుస్తుందీ? ఇక రాత్రిళ్ళంటారా, యీ గదిలో పది గంటలకు పడకేశారంటే తెల్లారి ఎనిమిదింటిదాకా వొళ్ళు తెలియని నిద్రాయె.... ఇంకెలా తెలుస్తుందీ మీకు?"

"ఐతే రాత్రిళ్ళు అది బైటికి వెళ్తోందంటావా?"

"నేను అనటం దేనికీ? ఊరందరికీ తెలుసు. మీకు ఒక్కరికే తెలియదు.. మీ అమాయకత్వం చూస్తే నవ్వు కూడా వొస్తోంది–"

తనకింకా నమ్మకం కలగనట్టుగా సాంబమూర్తి సావిత్రి ముఖంలోకి చూశాడు.

"ఒక్కటి ఆలోచించండి. నిండు యవ్వనంలో వుంది. భర్త ఎక్కడో మిలిటరీ ఉద్యోగంలో ఉన్నాడు. ప్రకృతి సిద్ధమైన కామవాంఛ లలితకు కలగటంలో ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు. బ్రహ్మచారి జీవితాన్ని గడుపుతూన్న సూర్యాన్ని ఆకర్షించటం ఎంతలోపనీ? ఇద్దరి అవసరాలు తీరే మార్గం ఉన్నప్పుడు-"

ఇక ఆపు అన్నట్టు చూశాడు సాంబమూర్తి.

"ఎలాగైనా నేను పరాయిదాన్నేలెండి. మీ తోబుట్టువు మీద యీగ వాల కూడదు. ఆ వాలేది యీగైతే అంత ప్రమాదం కాదుకాని, బ్రహ్మచారి సూర్యం కనుక, ఒకటికి రెండుసార్లు హెచ్చరించవలసి వొచ్చింది. ఆ తరువాత మీ ఇష్టం."

"దాని సంగతి కనుక్కుంటాలే. రేపు ఆ సూర్యంగాణ్ని-"

"అతనిదేముందీ? యీమెగార్నేమన్నా బలవంతం చేశాడా? మన బంగారం మంచిదైతే ఇతరులను అనవలసిన పనేముందీ?... అతని జోలికి వెళ్తే మరింత గోలవదుటండి? ఏదోవిధంగా మన అమ్మాయిని కట్టుబాటులో ఉంచుకోవాలి కాని-"

యీ వాదన సక్రమంగానే ఉన్నట్టు తోచింది సాంబమూర్తికి. పది గంటలు దాటి గంట గడవటం వల్ల సాంబమూర్తి నిద్రకు ఉపక్రమించాడు.

యధావిధిగా మర్నాడు లలితకు చివాట్లు తగిలినయ్. పిల్లి మీదా ఎలుక మీదా పెట్టిన దీవెనలు కూడా అందినవి. కారణాన్ని సూటిగా సూచించలేని కోపానికి ఆమె గురైంది. ఏ సమాధానమూ చెప్పుకోలేని స్థితిలో ఆమె భరించి ఊరుకుంది. తనకు తగిన అండలేని స్థితిలో ఉండబట్టి ఆమెకు మరో దారి లేకుండా పోయింది.

పరిస్థితులేమీ మారినట్టు కనిపించవు. ప్రతి రాత్రీ లలితమీద చాడీలు ఎక్కువైనవి. ఆమె ప్రేమ ఘట్టవైనాల్ని వర్ణించటంలో సావిత్రికి క్రమేపీ నేర్పు, టెక్నిక్ కూడా బాగా అలవడ్డవి. ఆ మాటల ధాటిని భరించలేని సాంబమూర్తి రోజురోజుకూ లలితను చిన్నచూపుతో బాధిస్తూనే వున్నాడు.

"చివరకు ఆమె లేచిపోతుంది... ఇది తప్పదు" యీ హెచ్చరిక వరకూ వ్యవహారం వొచ్చిందని సావిత్రి సూచించింది.

సావిత్రి చాలా తెలివిగలది. పరిస్థితుల్ని బట్టి జ్యోతిషం వలె కాకుండా, జరగబోయ్యేదాన్ని గ్రహించగల స్త్రీ. ఏ రాత్రి లలిత లేచిపోతుందని సావిత్రి భర్తను హెచ్చరించిందో - ఆ మర్నాటి ఉదయానికల్లా ఆమె సూర్యంతోనే లేచిపోయిందనే వార్తను నమ్మేందుకు సాంబమూర్తికి ఎక్కువకాలం పట్టలేదు. 'ఆమె' అంటే లలిత కాదు - సావిత్రి.

*- నవంబర్ 1948*